


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 18-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :31 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## మీనాక్షితో మంత్రుల భేటీ




కాంగ్రెస్ సంస్థాగత మార్పులపై చర్చ

జిల్లాల రాజకీయ సమీకరణాలపై ఫోకస్

ఎస్ఐఆర్ అమలు తీరుపై సమీక్ష

## గగన్‌యాన్‌పై కేంద్రం కీలక నిర్ణయం



సైంటిస్టుల వీఆర్ఎస్‌కు బ్రేక్

రాజీనామాలపై కఠిన నిబంధనలు

మిషన్లకు ఆటంకాలు లేకుండా చర్యలు

ఇస్రో ప్రాజెక్టులకు రక్షణ

మానవ అంతరిక్ష యాత్రపై ఫోకస్

అనుభవజ్ఞుల సేవలకు ప్రాధాన్యం

# కొత్త పింఛన్లకు కౌంట్‌డౌన్



ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్లు

అర్హులకే పింఛన్ల మంజూరు

2-3 లక్షల మందికి లబ్ధి

ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండ

లైవ్ అథెంటికేషన్ వేగవంతం

మరణించిన వారి పేర్ల తొలగింపు

అనర్హుల పింఛన్లకు కత్తెర

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఖాళీ నిధులతో కొత్త మంజూరు

**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు సహా కొత్త లబ్ధిదారులకు ఆగస్ట్ 15వ తేదీ నుంచి పింఛన్లు అందజేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటన సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబ ఆధారం లేక ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని భావిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

కొత్త పింఛన్ల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మిగతాది 2 లో..

## 20 రోజులకు చేరిన నిరాహార దీక్ష



క్షీణిస్తున్న వాంగ్ చుక్ ఆరోగ్యం

హైకోర్టు కీలక ఆదేశాలు

వైద్య పర్యవేక్షణకు గ్రీన్ సిగ్నల్

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్

దేశవ్యాప్తంగా పెరుగుతున్న మద్దతు

ప్రభుత్వ తీరుపై విమర్శలు

**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ చేస్తున్న నిరాహార దీక్ష 20 రోజులకు చేరుకుంది. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాంగ్ చుక్ నిరాహారదీక్ష ప్రారంభించారు. 19 రోజుల్లోనే వాంగ్ చుక్ 9 కేజీల బరువు తగ్గగా అతడి ఆరోగ్యం క్షీణిస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక మరో 48 గంటలు దీక్ష కొనసాగితే వాంగ్ చుక్ ప్రాణాలకే ప్రమాదం ఉందని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అతడి గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం ఆయనకు బలవంతంగా ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ న్యాయస్థానాన్ని కోరారు. దీంతో ఈ ఇష్యూపై ఢిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది.

## 50 వేల ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్



నిరుద్యోగులకు మంత్రి సీతక్క గుడ్‌న్యూస్

త్వరలో కొత్త నోటిఫికేషన్లు

70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ప్రభుత్వం

ఉద్యోగాల భర్తీపై కీలక ప్రకటన

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపు

ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్

**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** తెలంగాణలో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యలపై రాజకీయ సెగలు రాజుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల నిరంకుశ పాలనలో బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను నిలువునా ముంచిందని, యువత జీవితాలతో ఆడుకుందని ఆమె ఆరోపించారు. ఒకప్పుడు నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన రాష్ట్రంలో, గత ప్రభుత్వం కేవలం స్వలాభం కోసమే పనిచేసిందని విమర్శించారు. పదేళ్ల సుదీర్ఘ కాలంలో బీఆర్ఎస్ కనీసం లక్ష ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయిందని, నోటిఫికేషన్ల పేరిట కాలయాపన చేస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని మండిపడ్డారు.

## దేశంలో ఉగ్ర కుట్ర భగ్నం



జైష్ ఉగ్ర ముఠా అరెస్ట్

గుజరాత్ ఏటీఎస్ మెరుపు దాడులు

భారీ పేలుళ్ల కుట్ర భగ్నం

ఐదుగురు ఉగ్రవాదులు అరెస్ట్

ఉగ్ర నెట్‌వర్క్‌పై ఏటీఎస్ కొరడా

## మద్యం విక్రయాల్లో కొత్త ప్లాన్



తెలంగాణలో చిన్న బాటిళ్లు

మళ్లీ పెరగనున్న మద్యం ధరలు

చంద్రబాబు బాటలో రేవంత్

150 ఎంఎల్ బాటిళ్లకు గ్రీన్ సిగ్నల్?

మందుబాబులకు కొత్త ఆప్షన్

**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి మద్యం ధరలు పెంచేందుకు సిద్ధమైంది. మ ద్యాన్ని సామాన్య ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా సీసాల సైజు ను సవరించేందుకు కసరత్తు చేస్తున్నది. ఆంధ్రాలో చంద్రబాబునాయుడు అమల్లోకి తెచ్చిన 150 ఎంఎల్, 200 ఎంఎల్ మద్యం సీసాలను తెలంగాణలో కూడా ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ధరల నిర్ణయ కమిటీ రాష్ట్ర ప్రభుత్వంతో భేటీ కానున్నది. ఇప్పటికే కంపెనీలతో 11 సార్లు సమావేశమైన ఈ కమిటీ ధరల పెంపుపై తుది నిర్ణయాన్ని ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నది. ఇదే సమయంలో రాష్ట్ర మద్యం మార్కెట్‌లో 150 ఎంఎల్, 200 ఎంఎల్ పరిమాణంలో కొత్త మద్యం బా టిళ్లు ప్రవేశపెట్టే అంశంపై చర్చించనున్నారు. ఈ రెండు పరిమాణాల్లో మద్యం సీసాలను ఉ త్పత్తి చేయగలం అని ఇప్పటికే కొన్ని మద్యం కంపెనీలు టీజీబీసీఎల్‌కు తెలియజేసినట్టు సమాచారం.

ఫుల్ బాటిల్ మీద రూ 100కు పైగా ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండు సార్లు మద్యం ధరలు పెంచింది.

## దేశంలో తొలి హైడ్రోజన్ రైలుకు శ్రీకారం

జెండా ఊపిన ప్రధాని మోడీ

హర్యానాలో చారిత్రక ఘట్టం

కాలుష్యరహిత రవాణాకు శ్రీకారం

దేశీయ సాంకేతికతతో నిర్మాణం

హరిత ఇంధనంలో కొత్త అధ్యాయం

పర్యావరణ హిత రైల్వేకు నాంది

2 లో

## పార్లమెంట్‌కు 7 కీలక బిల్లులు

## 18వ లోక్‌సభ 8వ సమావేశాలు

ఆదాయపు పన్ను సవరణ బిల్లు

సుప్రీంకోర్టు బిల్లుకు ఆమోదం లక్ష్యం

ఎంఎస్ఎంఈ సవరణకు ప్రతిపాదన

పెండింగ్ బిల్లులపై చర్చ

ఉభయ సభల్లో ఉత్కంఠభరిత చర్చ

ఎన్డీయే అజెండాపై సర్వత్రా ఆసక్తి



## 22 కోట్ల ఓటర్ల డేటా చోరీ ఆరోపణ

చైనాపై ట్రంప్ సంచలన ఆరోపణలు

అమెరికా ఇంటెలిజెన్స్ పత్రాల వెల్లడి

ఎఫ్‌బీఐ విచారణకు ట్రంప్ ఆదేశాలు

ఎన్నికల వ్యవస్థపై సైబర్ ముప్పు ఆందోళన

ఆరోపణలను ఖండించిన చైనా

## ఏపీలో పెరుగుతున్న కరోనా కేసులు

అధికారులను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

20 రోజుల్లో 13 కొత్త కేసులు

మందులు, టెస్టులు సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు

జీనోమ్ సీక్వెన్సింగ్‌కు శాంపిల్స్ పంపింపు

కోవిడ్ పరిస్థితిపై సీఎం సమీక్ష అవకాశం

కడపలోనే అత్యధిక కరోనా కేసులు

యిమ్స్‌లో కరోనా బాధితురాలికి చికిత్స

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 18-07-2026

# దేశంలో ఉగ్ర కుట్ర భగ్నం



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** భారతదేశంలో భారీ పేలుళ్లకు కుట్ర చేస్తున్న ఉగ్ర కుట్రను గుజరాత్ ఏటీఎస్ భగ్నం చేసింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న నిషేధిత ఉగ్రవాద సంస్థ 'జైష్-ఎ-మొహమ్మద్' నెట్‌వర్క్‌పై గురువారం గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కొరడా ఝుళిపించింది. ఈ ఉగ్రవాద సంస్థకు చెందిన మాడ్యూల్‌పై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా గుజరాత్‌లోని పటాన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా పరిధిలోని ఖాదియాల్ గ్రామంలో ఏటీఎస్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించి ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు.

ఈ నెల ప్రారంభంలో (జూలై 3న) గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో ఎనిమిది మంది జైష్ ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వారిని విచారించగా తేలిన వివరాల ఆధారంగానే ఈ తాజా అరెస్టులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పట్టుబడిన నిందితులను బిలాల్ ఆబిద్ షేరా, మహమ్మద్ అయూబ్ కాడీవాలా (అలియాస్ మహ్మద్ ఖాదియాసన్), మహమ్మద్ షఫీ ముఖీ (అలియాస్ షఫీ చాపి), మహ్మద్ హసన్ కరాడియా (అలియాస్ హసన్ హైదర్ పూరి), మహ్మద్ అయూబ్ సునాసరా (అలియాస్ మహ్మద్ ఖాలీ)లుగా గుర్తించారు. నిందితుల్లో ఒకరు గతంలో టైమ్ బాంబు తయారు చేసేందుకు విఫలయత్నం చేశాడని, ప్రస్తుతం వీరిని కోర్టు జూలై 24 వరకు ఏటీఎస్ కస్టడీకి అప్పగించిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. వీరి వద్ద నుంచి బాంబు తయారీ సామాగ్రి, ఉర్దూ జిహాదీ సాహిత్యాన్ని రికవరీ చేశారు. అలాగే మరి వివరాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# దేశంలో తొలి హైడ్రోజన్ రైలుకు శ్రీకారం



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** భారతీయ రైల్వే చరిత్రలో చారిత్రాత్మక ఘట్టానికి హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్ వేదిక అయింది. హైడ్రోజన్ రైలు రాకతో పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధన విప్లవంలో ఒక సరికొత్త అధ్యాయం లిఖించబడింది. హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్ నుండి సోనిపట్ వరకు నడవనున్న దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జెండా ఊపి ప్రారంభించారు. శూన్య ఉద్గారాలు , కాలుష్య రహిత ప్రజా రవాణాయే లక్ష్యంగా భారత రైల్వే ఈ సరికొత్త టెక్నాలజీని పట్టాలెక్కించింది.

పర్యావరణానికి వరం - దేశీయ సాంకేతికతతో నిర్మాణం

ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవంలో హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, కేంద్ర రైల్వే శాఖ అధికారులు జింద్ స్టేషన్ నుండి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. హైడ్రోజన్ ఇంధన కణాల ద్వారా నడిచే ఈ రైలు పూర్తిగా పర్యావరణ అనుకూలమైనది. ఇది పొగకు బదులుగా కేవలం నీటి ఆవిరి, వేడిని మాత్రమే వదులుతుంది. తద్వారా కార్బన్ ఉద్గారాలను పూర్తిగా అరికట్టవచ్చు. 'మేక్ ఇన్ ఇండియా' చొరవలో భాగంగా దేశీయంగానే ఈ హైడ్రోజన్ రైలు సాంకేతికతను అభివృద్ధి చేశారు. రాబోయే రోజుల్లో దేశంలోని వివిధ పర్యాటక మరియు చారిత్రాత్మక నగరాల మధ్య ఇటువంటి మరిన్ని పర్యావరణ అనుకూల హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.

# 20 రోజులకు చేరిన నిరాహార దీక్ష

**మొదటి పేజీ తరువాయి**

వాంగ్ చుక్ ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎలాంటి వైద్య చికిత్సలైనా అందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైందని, అలాంటి ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలతో వైద్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా వాంగ్ చుక్ కు చికిత్స అందిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇదిలా ఉంటే నీట్ పేపర్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్ తో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై దేశవ్యాప్తంగా కనీసం 12 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నప్పటికీ కేంద్రం మాత్రం పట్టించుకోవడంలేదు. మరోవైపు వాంగ్ చుక్ నిరాహార దీక్షకు దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతోంది.

# మీనాక్షితో మంత్రుల భేటీ



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ కాంగ్రెస్ కమిటీలో సంస్థాగత మార్పులు, జిల్లాల వారీగా రాజకీయ సమీకరణాలపై అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాష్ట్ర నేతలతో వరుస భేటీలు హాట్ టాపిక్?గా మారాయి. తాజాగా శుక్రవారం ఉదయం నుంచే పలువురు మంత్రులు మీనాక్షి నటరాజన్ తో భేటీ అయ్యారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణరావు తదితరులు ఇన్‌ఛార్జ్ మీనాక్షితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరుపై వారితో చర్చించినట్లు సమాచారం.

పార్టీపై ఫోకస్: గత కొంత కాలంగా అధికార కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు పార్టీకి డ్యామేజ్ చేస్తున్నాయి. ముఖ్యంగా డీసీసీలతో నిర్వహించిన సమావేశంలో మంత్రులపై జిల్లా కాంగ్రెస్ నేతలు ఫిర్యాదులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాల్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత నిర్మాణం, సమన్వయం తదితర అంశాలతో పాటు రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఎస్ఐఆర్ అమలు తీరుపై కీలక నేతలతో మీనాక్షి చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం కీలక భేటీల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 23 మంది సీనియర్ నేతలకు మీనాక్షి నటరాజన్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# 50 వేల ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్

**మొదటి పేజీ తరువాయి**

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఉపాధి అవకాశాలను కూడా తెలంగాణ సిద్ధించిన తర్వాత యువతకు దక్కకుండా చేశారని దుయ్యబట్టారు. అయితే.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుద్యోగుల సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే పారదర్శకంగా, ఎక్కడా కోర్టు వివాదాలు లేకుండా ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపామని ఆమె వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, దీనిలో భాగంగానే త్వరలోనే మరో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన సరికొత్త నోటిఫికేషన్‌లను విడుదల చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని ప్రకటించారు. నిరుద్యోగులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల విప్లవాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నిరుద్యోగ యువత నమ్మవద్దని, ప్రభుత్వంపై నమ్మకంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# గగన్‌యాన్‌పై కేంద్రం కీలక నిర్ణయం



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** భారతదేశంలోని అంతరిక్ష పరిశోధనల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గగన్‌యాన్' వంటి కీలక మిషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మిషన్‌కు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు గగన్‌యాన్‌తో పాటు ఇస్రో కు చెందిన ఇతర ప్రధాన అంతరిక్ష ప్రాజెక్టులలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది సమర్పించే స్వచ్ఛంద పదవీ విరమణ , రాజీనామా దరఖాస్తులను ఇకపై సాధారణ పద్ధతిలో ఆమోదించబోమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

మిషన్లు సజావుగా సాగేందుకు నిబంధనలు కఠినతరం..

దేశ భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలు, అంతరిక్ష పరిశోధనల కాలపరిమితిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు ప్రాజెక్టుల మధ్యలో తప్పుకోవడం వల్ల మిషన్ల పురోగతి మందగించే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అత్యంత అసాధారణమైన లేదా అనివార్యమైన పరిస్థితుల్లో మినహా, సాధారణ కారణాలతో ఇచ్చే రాజీనామాలను తిరస్కరించాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది. రాబోయే కాలంలో ప్రయోగించనున్న మానవసహిత అంతరిక్ష యాత్ర ను పూర్తి విజయవంతం చేయడంపైనే ప్రభుత్వం ప్రస్తుతం దృష్టి సారించింది.


# 22 కోట్ల ఓటర్ల డేటా చోరీ ఆరోపణ



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** సంచలన ప్రకటనలతో నిత్యం వార్తల్లో ఉండే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సారి చైనాపై కన్నేసినట్లు తెలుస్తుంది. ఈ మేరకు చైనాపై అత్యంత సంచలన ఆరోపణలు చేశారు. 2020 ఎన్నికల సమయంలో చైనా ఏకంగా 22 కోట్ల మంది అమెరికన్ ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని (డేటా) అక్రమంగా దొంగిలించిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. వైట్ హౌస్ నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన అమెరికా ఇంటెలిజెన్స్ పత్రాలను ఈ సందర్భంగా బయటపెట్టారు. దొంగిలించబడిన ఓటర్ల డేటాలో అమెరికన్ల పేర్లు, నివాస చిరునామాలు, ఫోన్ నంబర్లు, వారి రాజకీయ అనుబంధ సమాచారం (ఏ పార్టీకి మొగ్గు చూపుతున్నారు) వంటి అత్యంత సున్నితమైన సమాచారం చైనా చేతికి వెళ్ళిందని ట్రంప్ హెచ్చరించారు.

అమెరికా ఇంటెలిజెన్స్ వ్యవస్థలోని కొందరు ఉన్నతాధికారులు (డీప్ స్టేట్) ఈ సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారని, అధ్యక్షుడు, కాంగ్రెస్ (పార్లమెంట్) దృష్టికి రాకుండా తొక్కేశారని ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎఫ్‌బీఐ, డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్‌ను ఆయన ఆదేశించారు. కాగా, ఈ పత్రాల ఆధారంగా అమెరికాలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, బ్యాలెట్ కౌంటింగ్ వ్యవస్థలు విదేశీ శక్తుల సైబర్ దాడులకు గురయ్యే అవకాశం ఉందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేయగా.. వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను తక్షణమే తోసిపుచ్చింది. తాము ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో, ఎన్నికల్లో ఎన్నడూ జోక్యం చేసుకోబోమని చైనా స్పష్టం చేసింది.

# ఏపీలో పెరుగుతున్న కరోనా కేసులు





**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** దేశంలో మరోసారి కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తుంది. దేశంలో జూలై 1 నుండి 340కి పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక ఏపీలోనూ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. గడిచిన 20 రోజుల్లోనే రాష్ట్రంలో 13కు పైగా కేసులు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో 3, విశాఖలో 1, కాకినాడలో 1 కేసు నమోదైంది. మహమ్మారి కారణంగా ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు మృతి చెందారు. హోం ఐసోలేషన్ లో మరో ముగ్గురు ఉన్నారు. ఆస్పత్రిలో ఇద్దరు కోవిడ్ పేషంట్స్ కు చికిత్స అందుతోంది.

కృష్ణా జిల్లాకు చెందిన మరో మహిళ సైతం కరోనా బారిన పడగా ఆమెకు ఎయిమ్స్ లో చికిత్స అందిస్తున్నారు. జీనోమ్ సీక్వెన్సీ కోసం కరోనా బారినపడ్డ పేషెంట్ల శాంపిల్స్‌ను పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. కేసులు ఎక్కువగా వస్తుండటంతో ఇప్పటికే ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. అధికారులను అప్రమత్తం చేసింది. ముందులు, టెస్టులు అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. కరోనా కేసులపై నేడు మధ్యాహ్నం తరవాత సమీక్ష నిర్వహించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తోంది.

# పార్లమెంట్‌కు 7 కీలక బిల్లులు

## 18వ లోక్‌సభ 8వ సమావేశాలు



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** వచ్చే నెలలో 18వ లోక్‌సభ 8వ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏడు కీలక బిల్లులను పార్లమెంట్ ముందుకు తీసుకురావడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో ఐదు సరికొత్త బిల్లులు కాగా, గత సమావేశాల్లో ప్రవేశ పెట్టిన రెండు పాత బిల్లులు కూడా ఉన్నాయి. కొత్తగా ప్రవేశ పెట్టబోయే బిల్లులలో ఆదాయపు పన్ను (సవరణ) బిల్లు-2026, సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026లు అత్యంత కీలకమైనవి. ఇవి రెండూ ప్రస్తుతం అమల్లో ఉన్న అత్యవసర ఆర్డినెన్స్‌ల స్థానంలో చట్టబద్ధత కోసం రానున్నాయి. వీటితో పాటు జనన మరణాల నమోదు సవరణ బిల్లు, జాతీయ గౌరవానికి భంగం కలిగించకుండా నిరోధించే సవరణ బిల్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సవరణ బిల్లులను కూడా ప్రభుత్వం సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టనుంది.

ఇక గతంలోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి పెండింగ్‌లో ఉన్న మరో రెండు బిల్లులను కూడా ఈ విడత సమావేశాల్లోనే చర్చకు తీసుకోనున్నారు. ఈ ఏడాది మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు-2026తో పాటు, గత ఏడాది డిసెంబర్ 15న ప్రవేశపెట్టి నిశిత పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించిన 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025'లను ఈ సెషన్‌లో ఆమోదించుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఈ కీలక బిల్లులపై ఉభయ సభల్లోనూ అధికార, ప్రతిపక్షాల మధ్య సుదీర్ఘమైన, ఉత్కంఠభరితమైన చర్చ జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# మద్యం విక్రయాల్లో కొత్త ప్లాన్



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి మద్యం ధరలు పెంచేందుకు సిద్ధమైంది. మ ద్యాన్ని సామాన్య ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా సీసాల సైజు ను సవరించేందుకు కసరత్తు చేస్తున్నది. ఆంధ్రాలో చంద్రబాబునాయుడు అమల్లోకి తెచ్చిన 150 ఎంఎల్, 200 ఎంఎల్ మద్యం సీసాలను తెలంగాణలో కూడా ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ధరల నిర్ణయ కమిటీ రాష్ట్ర ప్రభుత్వంతో భేటీ కానున్నది. ఇప్పటికే కంపెనీలతో 11 సార్లు సమావేశమైన ఈ కమిటీ ధరల పెంపుపై తుది నిర్ణయాన్ని ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నది. ఇదే సమయంలో రాష్ట్ర మద్యం మార్కెట్‌లో 150 ఎంఎల్, 200 ఎంఎల్ పరిమాణంలో కొత్త మద్యం బా టిళ్లు ప్రవేశపెట్టే అంశంపై చర్చించనున్నారు. ఈ రెండు పరిమాణాల్లో మద్యం సీసాలను ఉ త్పత్తి చేయగలం అని ఇప్పటికే కొన్ని మద్యం కంపెనీలు టీజీబీసీఎల్‌కు తెలియజేసినట్టు సమాచారం.

ఫుల్ బాటిల్ మీద రూ 100కు పైగా ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండు సార్లు మద్యం ధరలు పెంచింది.గత ఏడాది ఫిబ్రవరిలో బీరు ధరలు 15 శాతం పెంచింది. రూ.210 ఉన్న బీరు ధరను రూ.30 నుంచి రూ.50 వరకు పెంచింది. అదే ఏడాది మేలో లిక్కర్ ధరలు పెంచింది. క్వార్టర్‌పై రూ.10, హాఫ్‌పై రూ.20, ఫుల్‌బాటిల్‌పై రూ.40 చొప్పున ధరలు పెంచింది. తాజాగా మరోసారి ధరలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ధరల నిర్ణయ కమిటీ పరిశీలనలో ఉన్న ప్రతిపాదనల ప్రకారం చీప్ లిక్కర్, మీడియం, ప్రీమియం, హయ్యర్ క్యాటగిరీ అన్ని తరహా బ్రాండ్లపై ధరల పెంపు ఉండే అవకాశం ఉంది.

ప్రీమియం బ్రాండ్ల ఫుల్‌బాటిల్‌పై రూ.100 వరకు, హయ్యర్ క్యాటగిరీ బ్రాండ్లపై రూ.120, సాధారణ వినియోగదారులు ఎకువగా కొనుగోలు చేసే చీప్ లిక్కర్ మీద రూ.90 వరకు పెంపు ఉండవచ్చని సమాచారం. ధరల సవరణతోపాటు మద్యం బాటిళ్ల పరిమాణాల్లో మార్పులు చేయాలని తయారీ సంస్థలు ప్రభుత్వానికి ప్రతిపాదించాయి. కొత్త సీసాల ద్వారా నెలకు కనీసం 2 లక్షల కేసుల మద్యం అదనంగా విక్రయించవచ్చని టీజీబీసీఎల్ అంచనా వేస్తున్నది.

# కొత్త పింఛన్లకు కౌంట్‌డౌన్



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు సహా కొత్త లబ్ధిదారులకు ఆగస్ట్ 15వ తేదీ నుంచి పింఛన్లు అందజేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు.

ములుగు జిల్లా పర్యటన సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబ ఆధారం లేక ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని భావిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

కొత్త పింఛన్ల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నిజమైన అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేదా అవకతవకలకు తావు లేకుండా పెన్షన్ల లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల్లో ఎవరైనా మరణించి ఉంటే.. వారి పేర్లను వెంటనే జాబితా నుంచి తొలగించాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. అలా మిగిలే నిధులను కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనర్హులు పింఛన్లు పొందకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు 2 నుంచి 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టింది. లబ్ధిదారుల ధృవీకరణ కోసం లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత ఆగస్ట్ 15వ తేదీ నుంచి అర్హుల ఖాతాల్లో పింఛన్ నగదు జమ కానుంది. దీంతో ఎన్నో నెలలుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ఒంటరి మహిళలు, ఇతర అర్హులలో ఆనందం వ్యక్తం అవుతోంది.

# బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్



**న్యూస్ డెస్క్, 17 జూలై (ఇది కద నిజం):** బ్రిటన్ నూతన ప్రధానమంత్రి గా లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లండన్‌లో నిర్వహించిన పార్టీ ప్రత్యేక సమావేశంలో లేబర్ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్ షబానా మహ్మద్ ఈ అధికారిక ప్రకటన చేశారు. ఇటీవల కీర్ స్టార్మర్ తన ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో బ్రిటన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది. బ్రిటన్ రాజ్యాంగం ప్రకారం, లేబర్ పార్టీ నూతన నేతగా ఎన్నికైన ఆండీ బర్న్‌హామ్‌ను కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3 రాబోయే సోమవారం అధికారికంగా ఆహ్వానించనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం, వచ్చే వారంలోనే ఆండీ బర్న్‌హామ్ 10 డౌనింగ్ స్ట్రీట్‌లో బ్రిటన్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆండీ బర్న్‌హామ్ గురించి

ఆండీ ముర్రే బర్న్‌హామ్ 1970లో ఇంగ్లాండ్‌లోని మెర్సీసైడ్‌లో జన్మించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి విద్యనభ్యసించి రాజకీయాలపై ఆసక్తితో లేబర్ పార్టీలో చేరారు. 2001 నుంచి 2017 వరకు సుదీర్ఘ కాలం పాటు ఎంపీగా సేవలందించారు. మాజీ ప్రధాని గార్డెన్ బ్రౌన్ క్యాబినెట్‌లో ట్రెజరీ, కల్చరల్, హెల్త్ మినిస్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. లేబర్ పార్టీ నాయకత్వం కోసం 2015, 2017 లో పోటీ చేసి విఫలమైనప్పటికీ, ఆయన అధైర్యపడలేదు. లండన్ రాజకీయాలను పక్కనబెట్టి 2017లో 'గ్రేటర్ మాంచెస్టర్' మేయర్‌గా ఎన్నికై, అక్కడి ప్రజల మన్ననలు పొందారు. కాగా పార్టీలో కీర్ స్టార్మర్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బర్న్‌హామ్.. ఇటీవల జరిగిన 'మేకర్‌ఫీల్డ్' పార్లమెంట్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించి మళ్లీ హౌస్ ఆఫ్ కామన్స్‌లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం లేబర్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉండటంతో, ఎంపీగా గెలిచిన ఆయనకు దేశ ప్రధాని పీఠాన్ని అధిరోహించేందుకు మార్గం సుగమమైంది.

# నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

## -- సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్



ఇది కద నిజం, కుక్కునూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకుని, కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించే విధంగా కనీస వేతనాలను పెంచాలని, కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో బాడీస సుజాత అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, రవాణా తదితర ఖర్చులకు అనుగుణంగా కార్మికుల వేతనాలు లేకపోవడంతో అసంఘటిత రంగ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు భారత కార్మిక సదస్సు సిఫారసు చేసిన కనీస వేతనాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులకు ఉన్న అనేక చట్టబద్ధ హక్కులను బలహీనపరుస్తూ, యజమానులకు అనుకూలంగా చట్టాలను మార్చడం దుర్మార్గమని అన్నారు. సమాన పనికి సమాన వేతనం, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులను పరిరక్షించే విధానాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. దేశ సంపదను సృష్టించే కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యత అని, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 30న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు షేక్ వలిపాషా, కారం రాజేశ్వరి, పోచారపు వెంకటేశ్వర్లు, దార కృష్ణ, కారం నాగలక్ష్మి, కాక కమల, గొంది దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ అధ్యక్షుడు నాగు జన్మదిన వేడుకలు

## - సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కుమారులు, కార్యకర్తలు





ఇది కద నిజం, కుక్కునూరు: కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముళిశెట్టి నాగేశ్వర్రావు (నాగు) జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ ఉపసర్పంచ్ పిచ్చుక రాజు ఆధ్వర్యంలో ముళిశెట్టి నాగు కుమారులు జయంత్ నాయుడు, ఉజిత్ నాయుడు శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కుక్కునూరు ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వేయికి పైగా బిస్కెట్ ప్యాకెట్లు, పెన్నులు అందజేశారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు 100 కేజీల చికెన్‌తో భోజన సదుపాయం కల్పించారు. అలాగే, కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు బ్రెడ్లు, ఫ్రూట్స్, పాలు పంచిపెట్టారు. అంతేకాకుండా భిక్షాటన చేసుకునే వారికి బిర్యానీ ప్యాకెట్లను అందించారు. అనంతరం ముళిశెట్టి నాగు నివాసంలో భారీ కేక్‌ను కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ వేడుకల్లో రమణరాజు, నరేంద్రరాజు, శేఖర్, వీరబాబు, మాచర్ల రమణయ్య, ముత్యాలరావు, అంగిరేకుల బాలాజీ, పాదం రాము, సరిహద్దు సత్యనారాయణ, నిమ్మల ప్రసాద్, భాస్కర్, గరటం రమణ, పుష్ప, హరి, రమణ, గరగా జగదీష్, గాదే సంజయ్, పరిటాల తేజ, పండు, సురేంద్ర, కుక్కునూరు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ఇది కద నిజం న్యూస్**
**హనుమకొండ, జూలై 17**

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవల అందుబాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల్లో భద్రతా భావాన్ని మరింత పెంపొందించేలా చర్యలు కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తే ప్రభుత్వ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువవుతాయని ఈ సమావేశంలో పేర్కొన్నారు.

## భూపాలపల్లి జిల్లా సెర్ప్(ఎస్ ఈ ఆర్ పి)ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ఇది కద నిజం న్యూస్**
**భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఏ)కార్యాలయంలో జిల్లా సెర్ప్ (ఎస్ ఈ ఆర్ పి) ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని రేగొండ మండలంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏ పి ఎం)గా విధులు నిర్వహిస్తున్న వోసుకుల ప్రేమ్ రాజ్ ని జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా జిల్లావ్యాప్తంగా ఉన్న సెర్ప్ ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా సంఘం నూతన కార్యవర్గ సభ్యులుగా ఉపాధ్యక్షులుగా రాజలింగం (ఏపీఎం, పలిమెల మండలం), కార్యదర్శిగా పసరగొండ మంజుల (ఏపీఎం, టేకుమట్ల మండలం), ఉప కార్యదర్శిగా సంతోషం పద్మ ( ఏపీఎం,భూపాలపల్లి మండలం),కోశాధికారిగా కే.రాజన్న (ఏపీఎం,మహదేవ్‌పూర్ మండలం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన యూనియన్ నాయకులు,కార్యవర్గ సభ్యులు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డి ఆర్ డి ఓ) బాలకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి,శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వోసుకుల ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, మరియు వారి సమస్యల పరిష్కారం కోసం యూనియన్ అహర్నిశలు కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర, జిల్లా స్థాయిలలో నిర్వహించే వివిధ ప్రభుత్వ కార్యక్రమాలలో ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయడంతో పాటు, ఉద్యోగుల హక్కుల సాధనతో పాటు వారు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేలా అవసరమైన పూర్తి సహకారం అందించేందుకు యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది నూతన కార్యవర్గ సభ్యులకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం అందరూ సమిష్టిగా,సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# వర్షాకాలం వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

## మీనపల్లి కలాన్ సర్పంచ్ తలరీ వెంకటమ్మ



ఇది కద నిజం, నవాబుపేట్: నవాబుపేట మండలం మీనపల్లి కలాన్ గ్రామంలో సర్పంచ్ తలరీ వెంకటమ్మ అధ్యక్షతన గ్రామ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలోని పారిశుధ్యం, తాగునీటి సరఫరా మరియు అభివృద్ధి పనులపై పాలకవర్గం చర్చించింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, దోమల నివారణకు దోమతెరలను వాడాలని, బయట దొరికే ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ, వేడిగా, తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని కోరారు. వర్షంలో తడిస్తే వెంటనే పొడి దుస్తులు ధరించాలని, ఆకుకూరలు, పచ్చ కూరగాయలను శుభ్రంగా కడిగి బాగా ఉడికించిన తర్వాతే తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు పొలాల్లో పనిచేసేటప్పుడు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, బోర్ మోటార్లకు దూరంగా ఉండి జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ఉపసర్పంచ్ అంజియాదవ్, వార్డు సభ్యులు కే. శేఖర్, పి. విజయ్ కుమార్, ఊరడి అరుణ, నాగి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ యూజీ ఫలితాలలో వైబ్రాంట్ అకాడమీ ప్రభంజనం:డైరెక్టర్ రాజేందర్ రెడ్డి

**ఇది కద నిజం న్యూస్ హనుమకొండ**



B . VINAYAK
ROLL NO. 4205102271

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్ - యూజీ) 2026 ఫలితాలలో వైబ్రాంట్ అకాడమీ విద్యార్థులు ఘన విజయం సాధించి ప్రభంజనం సృష్టించారని అకాడమీ డైరెక్టర్ సిహెచ్. రాజేందర్ రెడ్డి తెలిపారు. గురువారం విడుదలైన నీట్ ఫలితాలలో తమ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు జాతీయ స్థాయి నాణ్యమైన శిక్షణను అందుబాటులోకి తెచ్చేందుకు రాజస్థాన్ కోటాకు చెందిన వైబ్రాంట్ అకాడమీని వరంగల్‌లో స్థాపించామని తెలిపారు. మొదటి బ్యాచ్‌లోనే ఈ స్థాయి అద్భుత ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ అకాడమీ మొదటి నుండి జేఈఈ శిక్షణలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని, ఇప్పుడు వైద్య విద్యా ప్రవేశ పరీక్షలోనూ అదే విజయ పరంపరను కొనసాగించిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి విద్యా ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా జాతీయ స్థాయి విజేతలుగా తీర్చిదిద్దామన్నారు. ఈ ఫలితాలలో తమ అకాడమీ విద్యార్థి బి. వినాయక్ (హాల్ టికెట్ నంబర్: 4205102271) జాతీయ స్థాయిలో 143వ (ఏఐఆర్ - 143) ఉన్నత ర్యాంకు సాధించగా, మరో 12 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారని వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, నిరంతర పర్యవేక్షణతో పాటు విద్యార్థులలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ప్రేరణాత్మక (మోటివేషన్) సదస్సులు నిర్వహించడం వల్లే సాధారణ విద్యార్థులు సైతం అద్భుత ర్యాంకులు సాధించగలిగారని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహించడమే ఈ విజయానికి కారణమన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను అకాడమీ యాజమాన్యం ఘనంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో వైబ్రాంట్ అకాడమీ ప్రిన్సిపాల్ టి. శేషు కుమార్, పరిపాలనా విభాగం అధిపతి గూడెపు రఘుపతి, సమన్వయకర్త రామ్ గుమ్మడి, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అమృత్ భారత్ స్టేషన్ పథకం దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకం: ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి




ఇది కద నిజం:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తుండటం అభినందనీయమని ఎంఎల్‌సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను రూ.35.61 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం తెలంగాణకు గర్వకారణమని వారు చెప్పారు. ఈ అభివృద్ధి వల్ల ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది మరో కీలక అడుగని ఎంఎల్‌సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న రైల్వే స్టేషన్ల అభివృద్ధి భారత రైల్వేలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతుందని ఎంఎల్‌సీ ఏవీఎన్ రెడ్డి చెప్పారు.

## చిక్కడపల్లిలో డ్రంకెన్ డ్రైవ్ ఉల్లంఘనులపై కొరడా

### 12 మందికి జరిమానా, జైలు శిక్ష విధించిన కోర్టు

ఇది కద నిజం:చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి కోర్టు కఠిన శిక్షలు ఖరారు చేసింది. ఈ వివరాలను చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. ఎడుకొండలు వెల్లడించారు. తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 12 మందిని నాంపల్లిలోని ఎం.ఆర్. కాంప్లెక్స్‌లో ఉన్న 10వ జె.ఎం.ఎఫ్.సి కోర్టు మెజిస్ట్రేట్ ముందు పోలీసులు హాజరుపరచగా, వారిలో ఏడుగురికి కోర్టు జరిమానా విధించింది. ఇందులో ముగ్గురికి జరిమానాతో పాటు రెండు రోజుల పాటు సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. అలాగే, రెండోసారి, మూడోసారి మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఐదుగురికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానాను విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ 12 మంది నుంచి మొత్తం రూ. 69,200 జరిమానాను పోలీసులు వసూలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.





# పిట్లం--కల్వేర్ బీటీ రహదారి పనులకు శంకుస్థాపన

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 17: జుక్కల్ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు పిట్లం నుంచి కల్వేర్ వరకు సీఆర్ఆర్ నిధులతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రహదారి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో పిట్లం మండల అధ్యక్షుడు రవి, పెద్ద కొడప్గల్ అధ్యక్షుడు షామప్ప, పీఏసీఎస్ చైర్మన్ శపథం రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్, అశోక్, నవీన్, ప్రజాప్రతినిధులు, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని అదిగమించే పంటల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన



ఇది కదా నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 17: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అన్నారం కలాన్ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున తక్కువ కాల వ్యవధిలో పండే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా సోయాచిక్కుడు, మినుము, పెసర, కంది, ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు. పంటలు నీటి ఎద్దడికి గురయ్యే పరిస్థితుల్లో రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా తాత్కాలికంగా ఎద్దడి ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే 100 శాతం సబ్సిడీతో ఫాం పాండ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నందున ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బోరు బావులు ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రూప దస్తాగౌడ్, మండల వ్యవసాయ అధికారి వినోద్, వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

## బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన గర్భాలయ నిర్మాణానికి భూమి పూజ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాసర, జూలై 15: నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో నూతన గర్భాలయ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజతో శ్రీకారం చుట్టారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో, ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో భూపూజ, గణపతి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, వేదపండితులు, పరిపాలనా సిబ్బంది, గర్భాలయ నిర్మాణ దాతల కుటుంబ సభ్యులు, సైట్ ఇంజనీర్లు రామకృష్ణ, నాగరాజు, మురళీకృష్ణతో పాటు ఆలయ వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# సినిమా న్యూస్

## విజయ్ మూవీకి బ్రేక్



సినీ పరిశ్రమలో ఎంతో నమ్మకంతో సినిమాను ప్రారంభించినప్పటికీ, చిత్రీకరణలో కొంత భాగం పూర్తయ్యాక అవుట్‌పుట్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రాజెక్టులను నిలిపివేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలాంటి సంఘటనే విజయ్ దేవరకొండ కెరీర్‌లో కూడా చోటుచేసుకుంది. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. 2019లో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'డియర్ కామ్రేడ్' సినిమా విడుదలైంది. అయితే ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. అనంతరం ఆనంద్ అన్నామలై దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో 'హీరో' అనే టైటిల్‌తో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమాను ప్రారంభించారు. ఇందులో విజయ్ ప్రొఫెషనల్ బైక్ రేసర్ పాత్రలో నటించాల్సి ఉంది. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, శాలిని పాండే హీరోయిన్లుగా ఎంపికయ్యారు.

ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు, తొలి షెడ్యూల్‌ను సుమారు రూ.6 కోట్ల వ్యయంతో చిత్రీకరించారు. అయితే మొదటి షెడ్యూల్ అవుట్‌పుట్‌ను చూసిన తర్వాత విజయ్ దేవరకొండ పూర్తిగా సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. దీంతో స్క్రిప్ట్‌లో మార్పులు చేయాలని భావించినప్పటికీ, ఆ విషయంలో దర్శకుడు హీరో, నిర్మాతలను పూర్తిగా ఒప్పించలేకపోయాడని సమాచారం. తర్వాత ఈ సినిమా మళ్లీ ప్రారంభం కానుందని వార్తలు వచ్చినా, విజయ్ వరుస సినిమాలతో బిజీ కావడంతో ఈ ప్రాజెక్ట్ పూర్తిగా పక్కన పడిపోయింది. దీంతో విజయ్ దేవరకొండ- మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో తెరకెక్కాల్సిన 'హీరో' సినిమా తొలి షెడ్యూల్ పూర్తైన తర్వాతే నిలిచిపోయింది. ప్రస్తుతం మాత్రం విజయ్ దేవరకొండ, మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో 'రణబాలి' చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

## హారర్ డోస్ డబుల్

సక్సెస్‌ఫుల్ హారర్ ఫ్రాంచైజీగా పేరు తెచ్చుకున్న 'డిమాంటీ కాలనీ' సిరీస్ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇక దీనికి సీక్వెల్ తెనకెక్కించగా.. బాక్సాఫీసు వద్ద మంచి విజయం సాధించింది. దీంతో ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడో భాగంతో ప్రేక్షకులను మరోసారి వణికించేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'డిమాంటీ కాలనీ-3' . 'కోబ్రా', 'డిమాంటీ కాలనీ' మొదటి భాగాలకు దర్శకత్వం వహించిన అజయ్ జ్ఞానముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈసారి సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.

అయితే ఈ సినిమాలో రమేష్ తిలక్, సనంత్, అభిషేక్ జోసెఫ్ జార్జ్, హెలెన్ టేలర్, సింగంపులి, ఎంఎస్ భాస్కర్, ప్రముఖ కామెడీ నటుడు యోగిబాబు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇంతకుముందు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తైనట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా మూవీ మేకర్స్ ప్రేక్షకులకు ఒక క్రేజీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే సినిమాలో భయపెట్టే సీన్స్ చాలా గట్టిగానే ఉన్నట్లు అర్థమవుతోంది. దీంతో పాటు, ముందుగా అనుకున్న తేదీ కంటే ఒకరోజు ముందుగానే, అంటే సెప్టెంబర్ 10నే ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. "చీకటి తిరిగి వచ్చింది.. ఇది గుండె ధైర్యం లేనివారికి కాదు.. సెప్టెంబర్ 10న చీకటి మళ్లీ వస్తోంది, సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్ జత చేస్తూ ఓ వీడియోను కూడా పెట్టారు.




## ఆగస్టులో 'స్వయంభు'

టాలీవుడ్ నటుడు నిఖిల్ చాలా కాలం క్రితమే 'స్వయంభు' చిత్రాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. భారీ గ్రాఫిక్స్, యాక్షన్ సన్నివేశాలతో రూపొందుతున్న ఈ సినిమా నిర్మాణ పనులు ఎక్కువ సమయం తీసుకుంటున్నాయి. దీంతో సినిమా విడుదల కూడా ఆలస్యమవుతూ వస్తుంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి సంబంధించిన దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయని, ఈ వారంలో ఫస్ట్ కాపీ సిద్ధం కానుందని తెలుస్తోంది.

అలాగే ఈ సినిమాను ఆగస్టు నెలలో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాపై నిఖిల్ భారీ ఆశలు పెట్టుకున్నారు. మరి 'స్వయంభు' ఆయనకు ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి. ఈ చిత్రంలో సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తుండగా, భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు.




## 'జైలర్ 2' డీల్ ఎవరికి?




సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాను అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదలకు ఎక్కువ సమయం లేకపోయినా ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ బిజినెస్ మాత్రం ఇంకా పూర్తికాలేదని సమాచారం. దీనికి ప్రధాన కారణం 'జైలర్' తొలి భాగం తెలుగు రాష్ట్రాల్లో అంచనాలకు మించి విజయం సాధించడమే.

ఆ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్న డిస్ట్రిబ్యూటర్లకు భారీ లాభాలు రావడంతో, 'జైలర్ 2'పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులకు భారీ ధరను కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు డిస్ట్రిబ్యూటర్లు వెనకడుగు వేస్తున్నారని సమాచారం. అందుకే సినిమాపై మంచి క్రేజ్ ఉన్నప్పటికీ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల బిజినెస్ పూర్తికాలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను చివరకు ఏ సంస్థ లేదా డిస్ట్రిబ్యూటర్ దక్కించుకుంటారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

## కష్టాలే నన్ను తీర్చిదిద్దాయి



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి ఇటీవలే 'గాంధీ టాక్స్' చిత్రంతో అలరించారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్' చేస్తున్నారు. ఇందులో టబు, సంయుక్త, దునియా విజయ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. దీంతో పాటు ఆయన మిస్కిన్ దర్శకత్వంలో శృతి హాసన్, నాజర్ ప్రధాన పాత్రల్లో వస్తున్న 'ట్రైన్' సినిమాలో కూడా నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రలు త్వరలోనే విడుదల కాబోతున్నాయి. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న విజయ్ సేతుపతి తన చిన్ననాటి జ్ఞాపకాలను, ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను పంచుకున్నారు. చిన్నతనంలో ఎదురైన పేదరికం కారణంగానే తాను చాలా చిన్న వయసులోనే మెచ్యూరిటీ సాధించానని విజయ్ సేతుపతి చెప్పారు. తన బాల్యం మొత్తం ఆర్థిక ఇబ్బందులతోనే సాగిందని, ఏదైనా వస్తువు కావాలనుకుంటే తమ ఆర్థిక పరిస్థితిని బట్టి లెక్కలు వేసుకోవాల్సి వచ్చేదని గుర్తుచేసుకున్నారు.

చివరికి అప్పుల వాళ్లు ఇంటికి వచ్చినప్పుడు కూడా, తన తండ్రితో కలిసి తానే కూర్చుని ఆ సమస్యలను పరిష్కరించేవాడినని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజుల్లో తమ కుటుంబ పరిస్థితులే తమ ఆలోచనలను, కోరికలను శాసించేవని తెలిపారు. సినిమాల్లోకి రావడం అనేది తన జీవితంలో అస్సలు అనుకోలేదని విజయ్ సేతుపతి వెల్లడించారు. తనకు బిజినెస్‌మెన్ అవ్వాలనే కోరిక బలంగా ఉండేదని, పని చేయడం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. అందుకోసమే స్కూల్ చదివే రోజుల్లోనే రోజువారీ కూలి పనులకు వెళ్లేవాడినని, ఆ తర్వాత ఒక టెలిఫోన్ బూత్‌లో కూడా పనిచేశానని వివరించారు. జీవితంలో ఎదగడం కోసం ఎన్నో రాత్రిళ్లు కష్టపడి పని చేస్తూ చాలా తలుపులు తట్టానని ఆయన పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఇక్కడిదాకా వచ్చానని ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.